సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం : 14 : ఏప్రిల్ : 2023



మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలి

రుద్రంగి(వేములవాడ): మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలని అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఏపీడీ నర్సింహులు పేర్కొన్నారు. వీరుని తండాలో నర్సరీ పరిశీలించారు.



సీపీఆర్‌పై అవగాహన

సిరిసిల్ల: సిరిసిల్ల 'సెస్' ఆఫీస్‌లో గురువారం సీపీఆర్‌పై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో అవగాహన కల్పించారు. సెస్ చైర్మన్ రామారావు, ఎండీ రామకృష్ణ పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/27.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

మానవులందరూ ఒక్కటే కలిసిమెలిసి జీవించండి. పరస్పరం శత్రువులుగా మారకండి.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శుక్ర 6.35	శని 4.33

న్యూస్‌రీల్

ఆలయ ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు



ఆలయ ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వేములవాడ: రాజన్న ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి నిర్వాహకులు గురువారం ఉచితంగా వైద్యపరీక్షలు చేశారు. ఈసీజీ, బీపీ, షుగర్, టూడీ ఎకో పరీక్షలు చేశారు. వైద్యులు ప్రణతి, పృథ్వీ, సందీప్, సత్యారెడ్డి, హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మొత్తంగా 172 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు ఆలయ ఉద్యోగులు తెలిపారు. ఏఈవో ప్రతాప నవీన్, పీఆర్‌వో చంద్రశేఖర్, ఏఈ శేఖర్, అధికారులు శ్రీనివాస్, శివ, రాజేందర్, రాంకిషన్‌రావు, వంశీ, నర్సయ్య పాల్గొన్నారు.

పాఠశాల పనులు పరిశీలన



డీఈవోను శాలువాతో సత్కరిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రి పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరి–మన బడి పనులను గురువారం డీఈవో రమేశ్ కుమార్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి వేములవాడ మండలానికి వచ్చిన రమేశ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం వేములవాడ మండల పరిషత్‌లని భవిత సెంటర్‌ను పరిశీలించి దివ్యాంగుల వివరాలను నిర్వాహకురాలు జయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల కోసం వచ్చే సంవత్సరం వాహన సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. ఈసందర్భంగా డీఈవోను సన్మానించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న బుర్ర మధుసూదన్‌రెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా విద్యార్థినులకు నిర్వహిస్తున్న కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సులు గురువారం ముగిశాయి. చివరి రోజు మోటివేషనల్ స్పీకర్, ప్రొఫెసర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి ఉన్నతవిద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు. వారంపాటు ఇంగ్లిష్, కంప్యూటర్‌సైన్స్, పొలిటికల్‌సైన్స్, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, గణిత విభాగాల్లో నిష్ణాతులైన ప్రొఫెసర్లచే సదస్సులు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రజనీ తెలిపారు. వైస్‌ప్రిన్సిపాల్ సుధాసింధు, లైబ్రేరియన్ వి.రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పిల్లల్లో ఫైలేరియా లక్షణాలు



ఫైలేరియా పరీక్షలపై సమీక్షిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

సిరిసిల్ల: జిల్లాలో ఫైలేరియా నివారణకు టీఏఎస్–3లో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో ఆరుగురు విద్యార్థుల్లో ఆ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు తేలింది. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 60 పాఠశాలల్లో ఏడేళ్లలోపు విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఏప్రిల్ 1 నుంచి 1,627 మందికి పరీక్షలు చేయగా.. ఆరుగురిలో ఫైలేరియా పాజిటివ్ ఉన్నట్లు తేలింది. జిల్లాలో జరిగిన ఫైలేరియా పరీక్షలను డబ్ల్యూహెచ్‌వో జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, సీహెచ్‌వో ప్రతాపరెడ్డి, హెచ్‌ఈవో లింగం పర్యవేక్షించారు.

రోడ్ల విస్తరణ ఎప్పుడో?

- వేములవాడలో ఇరుకురోడ్లతో ఇబ్బంది
- మార్కింగ్ చేయడంతోనే సరి
- అమలుకు నోచుకోని సీఎం హామీ
- నిత్యం ట్రాఫిక్‌జామ్
- ఇబ్బందులు పడుతున్న జనం

వేములవాడ: ఆధ్యాత్మిక కేంద్రం.. దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ పట్టణంలో రోడ్ల విస్తరణకు మోక్షం కలగడం లేదు. ఇరుకైన రోడ్లతో జనం ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల విస్తరణ చేస్తామంటూనే ఏళ్లు గడుస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు సార్లు రాజన్న ఆలయానికి వచ్చి వెళ్లారు. రోడ్ల విస్తరణ చేపట్టాలని, గుడిని అభివృద్ధి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అయితే సీఎం ఆదేశాలు సైతం అమలుకావడం లేదు. వేములవాడలో రోడ్ల విస్తరణకు సర్వే చేస్తున్న అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా పట్టణవాసులతోపాటు రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కొంటున్నారు.



రాజన్న గుడికి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ఏర్పడ్డ ట్రాఫిక్‌జామ్

కొలతలు వేయడంతోనే సరి

- వేములవాడ మెయిన్‌రోడ్డును వంతెన నుంచి రాజన్న గుడి వరకు.. రాజన్న గుడి నుంచి భీమేశ్వరాలయం మీదుగా బద్దిపోచమ్మ గుడి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు గల రోడ్డును 80 ఫీట్లు విస్తరించేందుకు అధికారులు మార్కింగ్ చేశారు.
- ప్రతీసారి మార్కింగ్ చేయడం.. ప్రతిపాదనలు పంపడంతోనే అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.
- రోడ్ల విస్తరణకు వీటీడీఏ నుంచి నిధులు సమకూర్చుకున్నట్లు సైతం ఎమ్మెల్యే రమేశ్‌బాబు, వీటీడీఏ వైస్‌చైర్మన్ పురుషోత్తంరెడ్డి ప్రకటించారు.
- ఎమ్మెల్యే ప్రకటనతో ప్రజలు సంబరపడిపోయారు. కానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.
- ఇటీవల 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్‌లోనూ వేములవాడ పట్టణవాసులు చాలా మంది రోడ్ల విస్తరణ అంశాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు దృష్టికి తెచ్చారు. మొదటి విడతగా బ్రిడ్జి నుంచి రాజన్న గుడి వరకు 80 ఫీట్లతో విస్తరిస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన వీటీడీఏ సమావేశంలోనూ ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా రోడ్లు వెడల్పు అవుతాయో.. లేదో.. వేచి చూడాల్సిందే.

వ్యాపారులలో ఆందోళన

వేములవాడ ప్రధాన రహదారిపై ఉన్న వ్యాపారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ఎప్పుడు రోడ్ల విస్తరణ ప్రక్రియ ప్రారంభిస్తోందోనన్న భయం వెంటాడుతోంది. దుకాణాలను చక్కదిద్దుకోవాలన్నా.. అద్దె అంశం యజమానులతో మాట్లాడుకోవాలనే దానిపై అయోమయానికి గురవుతున్నారు.

రోడ్లు విస్తరించాలి



వేములవాడలో రోడ్ల విస్తరణ అనేది ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్‌జామ్‌తో వ్యాపారులు, స్థానికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన హామీలు కూడా అమలుకాకపోతే ప్రభుత్వం ఈ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలి. వేములవాడ రోడ్లు తక్షణమే వెడల్పు చేయాలి.
– చొక్కాల రాము, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు

చిన్నప్పటి నుంచి వింటున్నా..



వేములవాడలో రోడ్లు వెడల్పు చేస్తారని చిన్నప్పటి నుంచి వింటున్న. నిత్యం వివిధ పనులపై బైక్‌పై వెళ్తుంటే నరకంగా ఉంటుంది. ఏళ్లుగా చెబుతున్న రోడ్ల విస్తరణ ఎప్పుడు చేస్తారో అర్థం కావడం లేదు. తెలంగాణ వచ్చాకా సీఎం కేసీఆర్ మూడు సార్లు రాజన్నగుడిని సందర్శించడంతో మెయిన్ రోడ్డుకు మహర్దశ వస్తుందనుకున్నాం. కానీ ఈ పనులన్నీ పెండింగ్‌లోని ఉండిపోతున్నాయి.
– క్రాంతికుమార్, వేములవాడ

కారులో తిరగలేకపోతున్నాం



వేములవాడ మెయిన్ రోడ్డుపై కారులో తిరగలేకపోతున్నాం. గుడి ముందు నుంచి బస్టాండ్ వైపు వెళ్లాలంటే ట్రాఫిక్ కష్టాలు అన్నీ.. ఇన్నీ కావు. కారులో వెళ్లలేక బైక్‌ను తీసుకెళ్లాల్సి వస్తోంది. పదేళ్లుగా రోడ్ల విస్తరణ చేపట్టడమే లేదు.– ఎస్డీ ఫహాద్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, వేములవాడ

ప్రభుత్వానికి నివేదించాం



మెయిన్ రోడ్డు విస్తరణకు కొలతలు తీసుకున్నాం. వీటీడీఏ ఆధ్వర్యంలో నియమించిన స్పెషలాఫీసర్ సమక్షంలో టౌన్‌ప్లానింగ్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి కొలతలు తీశారు. బ్రిడ్జి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు 80 ఫీట్ల వెడల్పుతో విస్తరణకు నివేదికలను ప్రభుత్వానికి అందజేశాం.
– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

వేములవాడ వివరాలు ఇలా..

బ్రిడ్జి నుంచి గుడి వరకు	
మెయిన్‌రోడ్డు పొడవు	: 800 మీటర్లు
గుడి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు	
మెయిన్‌రోడ్డు పొడవు	: 800 మీటర్లు
రోడ్డు విస్తరించాల్సిన పొడవు	: 1,600 మీటర్లు
ప్రస్తుతం ఉన్న మెయిన్‌రోడ్డు వెడల్పు	: 20 నుంచి 25 ఫీట్లు
చేపట్టాల్సిన రోడ్ల వెడల్పు	: 80 ఫీట్లు
ఇళ్లు కోల్పోతున్న యజమానులు	: 439 మంది
పట్టణ జనాభా	: 50 వేలకు పైగా..
నిత్యం వచ్చే భక్తులు	: 30 వేల నుంచి 40 వేలు
ఆటోలు	: 1,800
నిత్యం వచ్చే ప్రైవేట్ వాహనాలు	: 5 వేలకు పైగానే ..

స్పాట్ కేంద్రం ఎదుట టీపీటీఎఫ్ నిరసన



కరీంనగర్: ఎస్‌ఎస్‌సీ మూల్యాంకనం రేట్లు పెంచాలని, పాత బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్పాట్ కేంద్రం ఎదుట టీపీటీఎఫ్ కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరితో ఉందన్నారు. గతేడాది స్పాట్ మూల్యాంకనం డబ్బులు ఇప్పటికీ అందలేదని పేర్కొన్నారు. గతంలో ప్రతీ సబ్జెక్టుకు రెండు పేపర్లు ఉంటే ఈసారి ఒకే పేపర్ ఉందని.. తద్వారా ఉపాధ్యాయులపై పనిభారం ఎక్కువైందని.. మూల్యాంకనం రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి, కార్యదర్శి జంకె రామచంద్రారెడ్డి, శశిధర్, తిరుపతి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోర్నాల భూపాల్ రెడ్డి, దుమాల రమానాథ్ రెడ్డి, నాయకులు జంకె రామచంద్రారెడ్డి, కృష్ణ చైతన్య, కనకయ్య రాంబాబు, సమ్మయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరిస్తున్న ప్రభుత్వం



సిరిసిల్లటౌన్: నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము పేర్కొన్నారు. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రాము మాట్లాడుతూ యువకులు ప్రాణాలకు తెగించి పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే.. ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో నియామకాలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొలువులను భర్తీ చేయాలని కోరారు. లక్ష్మణ్, అనిల్, కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నివేదికలు గోప్యంగా ఉంచాలి

- మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు నిర్వహించిన పరీక్షల్లో ప్రాథమికంగా ఎలాంటి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణయితే వారి పేర్లను గోప్యంగా ఉంచాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి పంపించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,579 మందికి 3,005 రకాల పరీక్షలు నిర్వహించారని, 2,375 పరీక్షలకు సంబంధించిన నివేదికలు రాలేదని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు వివరించారు. 578 మంది మహిళల పరీక్షల నివేదికలు నార్మల్‌గా ఉన్నాయని, 52 మందికి సంబంధించిన నివేదికల్లో అసాధారణంగా ఉన్నట్లు తేలిందన్నారు. తంగళ్లపల్లి, నేరెళ్ల, సుందరయ్యనగర్, వేములవాడ పీహెచ్‌సీలకు ప్రత్యేకాధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మహిళకు కనీసం ఎనిమిది పరీక్షలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, జిల్లా ఉపవైద్యాధికారులు రజిత, శ్రీరాములు పాల్గొన్నారు.



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్‌లో గురువారం అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆవిష్కరించారు. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు నిర్వహించే వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. ×అగ్ని ప్రమాదాలను అరికడదాం .. జాతి సంపదను పెంపొదిద్దాం౯ అనే నినాదంతో పోస్టర్లను రూపొందించారు.

మెరుగైన ఉపాధి లక్ష్యం

- బతుకమ్మ చీరలతో సిరిసిల్లలో మార్పు
- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్



మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: నేతకార్మికుల ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. స్థానిక గణేశ్‌నగర్‌లో గురువారం మనోవికాస కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలనే లక్ష్యంతో బతుకమ్మచీరల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం త్రిఫ్ట్ పథకం, యారన్ సబ్సిడీ, నేతకార్మికులకు బీమా పథకం, వర్కర్ టు ఓనర్ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్మికులు, ఆసాములు, యజమానులు సమన్వయంతో పని చేసి, పరస్పర సహకారంతో ముందుకుసాగాలని ప్రవీణ్ కోరారు. సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ మాట్లాడుతూ మానసిక సమస్యలు ఎదురైతే స్థానిక మనోవికాస కేంద్రాన్ని ఆశ్రయించాలని సూచించారు. కౌన్సిలర్ వేముల రవి, కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు జక్కుని దేవదాస్, శ్రీకాంత్, హెల్పింగ్ హార్ట్స్ సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, పోరండ ల రమేశ్, మనోవికాస సిబ్బంది వేముల అన్నపూర్ణ, రాపెల్లి లత, కొండ ఉమ, బూర శ్రీమతి పాల్గొన్నారు.

పల్లెల్లో కోతులదండు

- జనంపై దాడిచేస్తున్న వానరాలు
- జిల్లాలో నెల రోజుల్లో 59 మందికి గాయాలు
- కాలు విరిగి ఒకరి పరిస్థితి విషమం
- ఇంటి పెంకులు, ఇంట్లో సామగ్రి ధ్వంసం
- భయాందోళనలో ప్రజలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామానికి చెందిన జాగిరి బాలలక్ష్మి. సొంత పనిమీద బజారుకు వెళ్లి తిరిగి వస్తుండగా కోతులు వెంటపడ్డాయి. వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కిందపడింది. ఆమెపై కోతుల దండు దాడి చేయడంతో ఒళ్లంతా గాయాలయ్యాయి. స్పృహతప్పి పడిపోయిన ఆమెను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం లేకపోగా గాయాలతో బాధపడుతోంది.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పల్లె ప్రజలు కోతులు చూస్తేనే హడలిపోతున్నారు. ఇళ్లపైకి చేరి గూనపెంకులు లేపడం, ఇంట్లోకి ప్రవేశించి నిత్యావసర సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయి. అంతటితో ఆగకుండా మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల జిల్లాలో కోతుల దాడులు పెరిగిపోయాయి. కోతులతో వేగలేక గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో నివసించే వారు తమ ఇళ్లను ఖాళీ చేసిన సందర్భాలు ఉన్నాయి.

నెల రోజుల్లో 59 మందికి గాయాలు

జిల్లాలో నెల రోజుల్లోనే కోతులు 59 మందిపై దాడి చేశాయి. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ఇల్లందుల హంసవ్వ, ఇల్లందుల లక్ష్మి అనే మహిళలపై దాడి చేయగా హంసవ్వ కాలువిరిగి పరిస్థితి విషమంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పరిపాటిగా మారిపోయాయి. వానరుల దాడులతో ఇళ్ల పైకప్పులు ధ్వంసం కాగా వర్షాకాలంలో వర్షానికి ఉరుస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కోతులను గ్రామం దాటించడానికి వేటగాళ్లను రప్పించి వలల సహాయంతో వాటిని ఊరు దాటిస్తున్నా ఫలితం ఉండడం లేదు.

అడుగడుగునా కోతులే..

వేసవిలో అటవీ ప్రాంతంలో పండ్లు దొరక్క కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఏ గ్రామంలో చూసిన వందలకొద్ది కోతులు కనిపిస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయి. అడ్డువెళ్లిన వారిపై దాడులు చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కోతుల కోసం వంతుల వారీగా కర్రలు పట్టుకుని కాపలా కాస్తున్నారు. అంతేకాకుండా కిరాణ దుకాణాల్లోకి ప్రవేశించి నష్టం కలిగిస్తున్నాయి. మరికొన్ని గ్రామాల్లోనైతే రైతులు తమ చేనులను కాపాడుకోవడానికి కొండెంగలను తీసుకొస్తున్నారు. హరిదాస్‌నగర్‌లో కోతుల బెడద నుంచి బయటపడడానికి కొండెంగలను ఇళ్ల ముందు కాపలాగా ఉంచుకుంటున్నారు.


వారంలో ముగ్గురిపై దాడి

సింగారం, రాచర్లబొప్పాపూర్‌లలో గుంపులుగా ఉన్న కోతులు వారం వ్యవధిలో ముగ్గురిపై దాడి చేశాయి. నడుచుకుంటూ వెళ్తున్న హంసవ్వపైకి కోతుల గుంపు ఎగబడడంతో తప్పించుకునే ప్రయత్నంలో కింద పడగా కాలు విరిగింది. సంఘటన స్థలంలోనే స్పృహ తప్పి పడిపోయిన ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా మారింది. అదే గ్రామానికి చెందిన ఇల్లందుల లక్ష్మి తన ఇంట్లో పనిచేసుకుంటూ ఉండగా సుమారు డజన్ కోతుల వరకు ఇంట్లో చొరబడి వంట సామగ్రిని ధ్వంసం చేస్తుండగా వాటిని తరిమేందుకు వెళ్లిన ఆమెపై ఎదురుదాడి చేశాయి. తీవ్ర రక్తస్రావంతో ఆమె కూడా ఆస్పత్రి పాలైంది. సింగారంలో బాలలక్ష్మి ఇంట్లో పనిచేసుకుంటున్న సందర్భంలో దాడి చేసి గాయాలకు గురిచేశాయి. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.




గంభీరావుపేటలో ఇంటి ముందు తిరుగుతున్న కోతులు

ఒకేసారి మీదపడ్డాయి



ఇంట్లోకి వచ్చి వంట సామగ్రిని ధ్వంసం చేస్తుండగా బెదిరించాలనుకున్న. ఒకేసారి మూడునాలుగు కోతులు మీదికొచ్చినయి. ప్రాణం పోతుందని పెద్దగా కేకలు పెట్టిన. దీంతో పక్కింటి వారు వచ్చి కర్రలతో కోతులను తరిమివేశారు. దీంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డా.
– ఇల్లందుల లక్ష్మి, బొప్పాపూర్

అందుబాటులో వ్యాక్సిన్‌లు



గ్రామాల్లో కోతుల దాడుల్లో గాయపడ్డ వారికి యాంటిరేబిస్ వ్యాక్సిన్‌లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంచాం. కోతులు, కుక్కల బెడద గ్రామాల్లో తీవ్రంగా ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ రెండింటి నివారణకు వ్యాక్సిన్‌లను ఇవ్వడానికి సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాం. ఎవరైన దాడులకు గురైతే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స పొందాలని కోరుతున్నాం.
– బాబు, ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్

ఆర్థికాభివృద్ధికి కొత్త పథకం



ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న పోస్టల్ సిబ్బంది

- మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్-2023 పేరిట పథకానికి శ్రీకారం
- రూ.వెయ్యినుంచి రూ.2 లక్షల్లోపు డిపాజిట్
- గ్రామాల్లో విస్తృత ప్రచారం

బోయినపల్లి (చొప్పదండి) : మహిళల ఆర్థికాభివృద్ధికి పోస్టల్ శాఖ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్-2023 పేరిట కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. కేవలం మహిళలు, బాలికలు మాత్రమే ఈ పథకంలో చేరేందుకు అర్హులు. కేంద్ర ప్రభుత్వం 2023-24లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చిన్న మొత్తాల పొదుపు పథకం కింద మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్-2023 పేరిట నూతన పథకానికి తపాలా శాఖ ద్వారా శ్రీకారం చుట్టింది. మార్చి 31 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చింది. ఇది వన్‌టైం సేవింగ్స్ పథకం 31-03-2025 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

రూ. వెయ్యినుంచి రూ. 2 లక్షల వరకు..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ డిపాజిట్‌ను రూ.వెయ్యినుంచి, రూ.2 లక్షలవరకు డిపాజిట్ చేసి తెరవచ్చు. (రూ. వెయ్యి, రూ. 5,000, 10,000, రూ. 2లక్షల్లోపు ఎంతైనా డిపాజిట్ చేసే వీలు ఉంది.) ఒకటి కంటే ఎక్కువ ఖాతాలు తెరవాలంటే ఖాతాలు ప్రారంభించడానికి రెండు ఖాతాల మధ్య కనీసం మూడు నెలల వ్యవధి ఉండాలి. ఈ పథకంలో వడ్డీని 7.5 శాతంగా నిర్ణయించారు. వడ్డీ త్రైమాసికానికి కలిపి ఖాతాలో జమచేస్తారు. (రూ.2 లక్షలకు 7.5 శాతం వడ్డీతో రెండు సంవత్సరాలకు రూ.2,32,044 లబ్ధిదారుకు అందిస్తారు). ఖాతా తెరిచిన తేదీనుంచి సంవత్సరం తర్వాత అర్హత ఉన్న బ్యాలెన్స్ నుంచి 40 శాతం డబ్బులు తీసుకునే అవకాశం ఉంది. ఖాతాదారుడి మరణం, ప్రాణాంతక వ్యాధులు ఉన్నపుడు మందస్తుగా ఖాతా ఉపసంహరణ చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితి తలెత్తితే స్కీం వడ్డీ, అసలు మొత్తంపై చెల్లిస్తారు. సంబంధిత తపాలా కార్యాలయంలో ఖాతా తెరిచే దరఖాస్తు ఫారం తీసుకొని ఆధార్, పాన్‌కార్డుతో డిపాజిట్ డబ్బు పోస్టు ఆఫీస్‌లో జమచేయాలి.

గ్రామాల్లో అవగాహన

మహిళల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన పథకంపై కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ వై.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామాల్లో రివ్యూ సమావేశాలు నిర్వహించి మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. పోస్టల్ సిబ్బంది ఇంటింటా తిరుగుతూ పథకంపై ప్రచారం చేస్తున్నారు. పోస్టల్ మేలోరిసియర్ మల్లేశం, బోయినపల్లి ఎస్‌వో ఎస్పీఎం ఎంవీ. స్వామి తమ పరిధిలో ఉపాధిహామీ కూలీలు పనిచేసే ప్రదేశాల్లోకి బీపీఎంలతో వెళ్లి పథకంపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.



బోయినపల్లి ఎస్‌వోలో మహిళా సమ్మాన్ పథకంలో డిపాజిట్ చేసిన మహిళ

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



చిన్న మొత్తాల పొదుపు పథకంలో భాగంగా మహిళల ఆర్థిక ఎదుగుదలకు మహిళా సమ్మాన్ సర్టిఫికెట్ -2023 ను ప్రవేశపెట్టింది. మహిళలు రూ. వెయ్యి నుంచి రూ.2 లక్షల్లోపు డిపాజిట్ చేసుకోవచ్చు. పథకానికి వడ్డీ 7.5 శాతంగా నిర్ణయించారు. అన్ని వర్గాల మహిళలకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, కరీంనగర్ డివిజన్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడలో అభివృద్ధి పనుల పరిశీలన

వేములవాడ: ప్రజల సౌకర్యాల కోసం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడలో పలు అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. మండల పరిషత్‌లో నిర్మిస్తున్న గ్రంథాలయం, నందికమాన్ వద్ద చేపడుతున్న జంక్షన్ పనులు, పోలీస్‌స్టేషన్ ముందున్న ప్రాథమిక పాఠశాల భవనం పనులు, మూలవాగు ఒడ్డున నిర్మాణంలో ఉన్న బండ్ పనులు, రాజన్న గుడి చెరువు వద్ద చేపట్టబోయే సుందరీకరణ పనులను గురువారం పరిశీలించారు.

వేములవాడ: మూలవాగు మురికికూపంగా మారడంతో ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ అనురాగ్ జయంతి స్పందించారు. గురువారం మూలవాగులో పేరుకుపోయిన మురికినీటిపై కమిషనర్ అన్వేశ్‌తో చర్చించారు. వాగును మురికినుంచి రక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



నంది కమాన్ జంక్షన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్

షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

- అగ్నికి ఆహుతైన రూ.6.90 లక్షల నగదు, రెండు తులాల బంగారం

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలకేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలోని బాబాజీ ఏరియాలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబాజీ కాలనీకి చెందిన మేకల భిక్షపతి, మేకల మురళి ఇళ్లకు తాళాలు వేసి పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం రెండు ఇళ్లనుంచి మంటలువ్యాపించగా స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలనార్పివేశారు. అప్పటికే సామగ్రి, వస్తువులు కాలిపోయాయి. మేకల భిక్షపతి కుమారుడి వివాహం జరగనునన్న నేపథ్యంలో ఇంట్లో దాచిన రూ.6 లక్షల నగదు, 2 తులాల బంగారం పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. మొత్తం రూ.9.90 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపాడు. మురళి ఇంట్లో రూ.70 వేలు నగదుతో పాటు ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయని, రూ.3.60 లక్షల నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అంకారపు అనిత, ఎంపీటీసీ కోడి అంతయ్య బాధితులను పరామర్శించారు. ఎంపీపీ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీటీసీ బియ్యం అందజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు ఎండీ.హమీద్, గుగ్గిళ్ల అంజయ్య, అంకారపు రవీందర్, పడిగెల రాజు ఉన్నారు.



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

సిరిసిల్ల టౌన్: దేశభక్తి ముసుగులో ప్రజల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ పాలన కొనసాగిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు మూశం రమేశ్ పేర్కొన్నారు. గురువారం సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా సీఐటీయూ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో వాక్ ఫర్ సోషల్ జస్టిస్ పాదయాత్రను వేములవాడ నంది కమాన్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశభక్తి ముసుగులో ప్రజల మధ్య చిచ్చుపెడుతోందన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని కాలరాస్తూ ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగిస్తోందన్నారు. మోర అజయ్, కవిత, ఒగ్గు గణేశ్, మాసం సురేశ్, తదితరులున్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కోనరావుపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. మండలకేంద్రానికి చెందిన దండెం అశోక్ 20 రోజులక్రితం వేములవాడ మండలం మల్లారం గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నాయకులు, కార్యకర్తల సహాయంతో జమయిన రూ.30 వేల నగదును గురువారం అందజేశారు. ఆయనవెంట నాయకులు మాందాల లింబయ్య, వంగపెల్లి శోభన్, కాంతయ్య, వంగపెల్లి మనోహర్, తదితరులు ఉన్నారు.

మజీద్ కమిటీ అధ్యక్షుడిగా సలీమ్ ప్రమాణస్వీకారం



బాధ్యతలు స్వీకరించిన ఎండీ సలీమ్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మజీద్ కమిటీ అధ్యక్షుడిగాఎండీ సలీమ్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఎన్నికల అధికారి అబ్దుల్ వహీద్ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. మజీద్ కమిటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అవాంచిత సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. మాజీ అధ్యక్షులు యూసుఫ్, సత్తార్, సభ్యులు షేక్ మహమ్మద్, ఫయాజ్, రఫీయొద్దీన్, మోసిన్, నయీమ్, రఫీ, అంజాద్ ఉన్నారు.

మహిళా సమ్మాన్ స్కీంపై ప్రచారం కల్పించాలి

బోయినపల్లి (చొప్పదండి): మహిళా సమ్మాన్ సేవింగ్స్-2023 పై విస్తృత ప్రచారం కల్పించాలిని కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ వై. వేంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండలకేంద్రంలో బోయినపల్లి ఎస్‌వో పరిధి పోస్టల్ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ కింద మహిళలు రూ. వెయ్యి నుంచి రూ. 2లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చని తెలిపారు. 7.5శాతం వడ్డీ ఉంటుందని, పథకం కాలపరిమితి రెండేళ్లని వివరించారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐపీవో చంద్రమోహన్, మేలోర్ సియర్ మల్లేశం, బోయినపల్లి ఎస్‌వో ఎస్పీఎం ఎంవీ.స్వామి, ఎస్‌వో పరిధిలోని బీపీఎంలు, పోస్టల్ సిబ్బంది, తదితరులున్నారు.



మాట్లాడుతున్న వేంకటేశ్వర్లు

మారసం కార్యవర్గానికి సత్కారం

సిరిసిల్లకల్చరల్: మానేరు రచయితల సంఘం ముప్పయి ఐదేళ్ల వేడుకకు సిద్ధమవుతోంది. ఈమేరకు నూతన కార్యవర్గాన్ని వ్యవస్థాపకుడు పత్తిపాక మోహన్ సారథ్యంలో ఎంపిక చేశారు. త్వరలో నిర్వహించే ఉత్సవ కార్యక్రమాల ప్రణాళికను విడుదల చేశారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనంలో గురువారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు టీవీ నారాయణ నేతృత్వంలో సాహిత్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఎంపికైన నూతన కార్యవర్గ ప్రతినిధులకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు బూర దేవానందం, గెంట్యాల భూమేశ్, చిటకెన కిరణ్‌కుమార్, కోశాధికారి జిందం అశోక్, ప్రచార కార్యదర్శులు మోత్కుల నారాయణ, శ్రీకాంత్‌శర్మ, మరింగంటి శ్రీకాంత్, తాటికొండ కృష్ణహరి పాల్గొన్నారు.



మారసం నూతన కార్యవర్గ బృందం

బడ్జెట్‌లో విద్యుత్‌కు అధిక నిధులు

- వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కథలాపూర్ (వేములవాడ): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యుత్‌కు అధిక నిధులు కేటాయించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. కథలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రూ.5కోట్లతో చేపట్టే సిస్టమ్ స్ట్రెంతనింగ్ పనులను ప్రారంభించారు. సిరికొండలో రూ. 20 లక్షలతో నిర్మించే ఆరోగ్య ఉపకేంద్ర భవనం పనులకు భూమిపూజ చేశారు. బొమ్మెన శివారులో రూ.1.10 కోట్లతో మరమ్మతు చేసిన బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు వరకు డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు ప్రక్రియ, రోడ్ల పనులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎత్తిపోతలతో కలిగోట సూరమ్మ ప్రాజెక్టులోకి నీరందించి కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాలకు సాగునీరందిస్తామన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సత్యనారాయణ, డీఈ తిరుపతి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ భూమయ్య, ఏఎంసీ చైర్మన్ గుండారపు సౌజన్య, సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంగప్రసాద్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ..

వేములవాడ : రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆవిష్కరించారు. అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్

జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బ నాగరాజు, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణారావు, ఉపాధ్యక్షుడు బందం వెంకటేశం ఎమ్మెల్యే రమేశ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. మిల్లర్ల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని హామీఇచ్చారు.

గుండెపోటుతో గీత కార్మికుడి మృతి

- ఈత చెట్టుపై కల్లు తీస్తుండగా ఘటన
- దుమాలలో విషాదం



ఎల్లయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఓ గీతకార్మికుడు వృత్తిరీత్య ఈత చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా గుండెపోటుకు గురై చెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన మండలంలోని దుమాలలో తీవ్ర విషాదం నింపింది. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన గీత కార్మికుడు కదిరె ఎల్లయ్య(49) కులవృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం యథావిధిగా కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు నుంచి కల్లు తీస్తున్న క్రమంలో కిందపడిపోయాడు. గమనించిన తోటికార్మికులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చెరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ఎల్లయ్య గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతునికి భార్య వనజ, కుమారులు సాగర్, శ్రావణ్, కూతురు మమత ఉన్నారు. ఎల్లయ్య కళాకారుడు సైతం. బ్రహ్మంగారి జీవితచరిత్ర నాటకంలో శంకరుడిపాత్ర పోషించాడు. ఎల్లయ్య మృతిపై మండలానికి చెందిన కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

ఈత కోసం కాలువలో దిగి బాలుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఈత కోసం సాగు నీటి కాలువలో దిగి, నీట మునిగి బాలుడు మృతిచెందిన సంఘటన గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో జరిగింది. కొత్తపల్లికి చెందిన మేడ నిఖిల్ (10) గురువారం సాయంత్రం తన బంధువుతో కలిసి పొలం దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఆడుకొని పక్కనే ఉన్న ఎగువమానేరు ప్రాజెక్టు కుడి కాలువలో ఈత కొట్టడానికి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందాడు. కాలువ గట్టుపై బట్టలు కనిపించడంతో భయాందోళనకు గురైన కుటుంబసభ్యులు, బంధువులు కాలువలో గాలించగా.. బాలుడి మృతదేహం లభించింది. బాలుడి మృతి గ్రామంలో విషాదం నింపింది. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. నిఖిల్ స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. తండ్రి నవీన్ ఇటీవల దుబాయి వెళ్లాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ఇల్లంతకుంట: మండలంలోని ముస్కాన్‌పేటకు చెందిన ఎండీ సాహెర (48) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే సాహెర కుమారుడు ఎండీ రహీం ఇరవై రోజులక్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి మనస్తాపానికి గురైన ఆమె జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ భూమయ్య పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కొలనూర్‌లో వృద్ధుడు..

కోనరావుపేట (వేములవాడ): అనారోగ్యంతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కొలనూర్‌కు చెందిన పుల్లి ఎల్లయ్య (60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం బ్యాంకుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పివెళ్లాడు. రాత్రివరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం గౌడ సంఘానికి చెందిన భూమిలో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. అనారోగ్యంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య దేవవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

సైబర్ నేరగాళ్ల కుచ్చుటోపీ

ధర్మపురి : సైబర్ నేరాలకు ధర్మపురికి చెందిన వ్యక్తి ఈనెల 14న మోసపోయాడు. క్రెడిట్ కార్డు పునరుద్ధరణ కోసం ఓటీపీ చెప్పగానే ఖాతాలో ఉన్న 1.93 లక్షలు మాయమయ్యాయి. బాధితుడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మరో వ్యక్తి వేముల ప్రశాంత్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వాట్సాప్, టెలిగ్రాం యాప్ లకు పార్ట్‌టైం జాబ్ చేస్తే డబ్బులు వస్తాయని బుధవారం మోసపూరిత ప్రకటనతో ప్రశాంత్ రూ. 6,64,000లను పోగొట్టుకున్నాడు. వెంటనే మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ కోటేశ్వర్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు. ఆన్‌లైన్‌లో మోసపోయి డబ్బులు పోగొట్టుకున్నట్లయితే 1930కి ఫోన్ చేయాలని తెలిపారు.

దివ్యాంగుడికి చేయూత



దివ్యాంగుడితో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

బోయినపల్లి (చొప్పదండి) : మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన దివ్యాంగుడు కత్తెరపాక వీరయ్యకు హోప్ ఫర్ స్పందన స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. రూ1.30 లక్షలతో కిరాణా షాపు నెలకొల్పేందుకు చేయూతనందించారు. గురువారం బీడీఎల్ విన్నర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు రఘు అరికపూడి, కోఆర్డినేటర్ కత్తెరపాక సుధాకర్, జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ కిరాణ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదిహేనేళ్ల క్రితం వీరయ్య కాలుకు చికిత్స తీసేశారని, ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాడని తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు లక్ష్మీనరసింహం కోట, న్యూ జెర్సీకి చెందిన సత్యసాయి శింగరాజుల ఆర్థికసాయంతో షాపును నెలకొల్పినట్లు పేర్కొన్నారు. అనంతరం వీరయ్య కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. జేరిపోతుల మహేశ్, రోమాల రమేశ్, గజ్జల నవీన్‌కుమార్, దయ్యాల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్న హుండీని ఈనెల 15న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. గుడిలోని ఓపెన్‌స్లాబ్‌లో ఉదయం 8 గంటల నుంచి కట్టుదిట్టమైన భద్రత నడుమ లెక్కించనున్నట్లు ఈవో పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

బాలుడికి ప్రాణభిక్ష పెట్టండి

- ఆడుకుంటూ వెళ్లి పురుగుల మందు తాగిన బాలుడు
- ఆపరేషన్‌కు రూ.10లక్షల ఖర్చు
- ఆపన్న హస్తం అందించాలని వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు రుద్రేశ్

గూగుల్ పే నెంబర్ 7569895470 ద్వారా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ప్రాణపాయ స్థితిలో ఉన్న బాలుడికి దాతలు ఆపన్నహస్తం అందించి ప్రాణభిక్ష పెట్టాలని ఆ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన ధ్యావ రేవతి-శ్రీకాంత్ రెడ్డి దంపతుల కుమారుడు రుద్రేశ్ (2) వారం క్రితం ఇంట్లో ఆడుకుంటూ పురుగుల మందు డబ్బా తీసుకొని తాగాడు. స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని రెయిన్‌బో పిల్లల ఆస్పత్రికి తరలించారు. చికిత్స కోసం ఇప్పటికే రూ.4లక్షలు ఖర్చు చేశారు. ఆపరేషన్‌కు మరో రూ.10లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ ఆదంపతులు కుమారుడిని కాపాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలుడి ఆపరేషన్‌కోసం దాతలు సాయం అందించాలని, మండల, గ్రామ రెడ్డి సంఘం సభ్యులు సాయం అందించాలని మండల రెడ్డిసంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి కోరుతున్నారు.